క్లుప్తంగా

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్):దుర్గాపురం అయ్యప్ప స్వామి మందిరంలో బుధవారం శ్రీ మణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. బల్లెం పూర్ణయ్య గురుస్వామి స్వామివారికి పంచామృత అభిషేకం, విశేషంగా అర్చనలు, పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, స్వాములు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అలరించిన ఆపాత మధురాలు



విజయవాడ కల్చరల్: సురభి కళావేదిక నెలవారీ కార్యక్రమంలో భాగంగా కొత్తా పూర్ణానందం కళావేదికమీద బుధవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయకుడు కామినేని ఉదయ శంకర్ పర్యవేక్షణలో గాయనీ గాయకులు కుసుమాంజలి, దయామణి, శ్రావణి, రహీమాలు తెలుగు, హిందీ చిత్రగీతాలను మధురంగా ఆలపించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ కళా సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సాంస్కృతిక కళా సంస్థలు నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పించాలన్నారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు చంద్రశేఖర్, జాస్తి కృష్ణ సింధూ, కృష్ణకుమారి పాల్గొన్నారు. నిర్వాహకులు గాయనీ గాయకులను ఆత్మీయంగా సత్కరించారు.

పోరంకిలో రామ్‌రాజ్ షోరూమ్ ప్రారంభం



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని పోరంకిలో రామ్‌రాజ్ షోరూమ్‌ను బుధవారం చీఫ్ కమిషనర్ ఆఫ్ స్టేట్ కమర్షియల్ ట్యాక్స్ డిపార్టుమెంట్ కమిషనర్ బాబు.ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి రామ్‌రాజ్ దుస్తులు అద్దం పడతాయని, అన్ని వర్గాలకు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ దుస్తులు నాణ్యమైన కాటన్‌తో తయారైనందున యాంటీ బ్యాక్టీరియల్, వైరల్ ఇన్ఫెక్షన్‌లను నివారిస్తాయని, షర్టులు, ధోతీలు, బనియన్లు తదితరాలతో దక్షిణాదితో పాటు ఉత్తర భారతదేశంలో కూడా మంచి గుర్తింపు సాధించిందన్నారు. కార్యక్రమంలో దుర్గగుడి ఈవో కేఎస్ రామరావు, విజయ పికిల్స్ మేనేజింగ్ డైరెక్టర్ కాటూరి రాము, రామ్‌రాజ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

హార్టికల్చర్ ఎక్స్‌పో బ్రోచర్ ఆవిష్కరణ



పటమట(విజయవాడతూర్పు): భవిష్యత్ తరాలు పర్యావరణ సహిత సాగు పద్ధతులు అవలంభించాల్సిన అవసరం ఉందని స్టెల్లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జసింత క్వాడ్రస్ అన్నారు. కళాశాలలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా ఈ నెల 18,19 తేదీల్లో కళాశాలలో హార్టికల్చర్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నామని తెలిపారు. పూలు, పండ్లు, మొక్కలు ప్రదర్శనతో పాటు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ఈ ఎక్స్‌పోను నిర్వహిసుతన్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎక్స్‌పో బ్రోచర్‌ను ఆమె విడదల చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సి ఇన్నసియా, డిగ్రీ వైస్ ప్రిన్సిపల్ ఉషాకుమారి, అగ్రికల్చర్ విభాగం అధిపతి డాక్టర్ లక్ష్మణ స్వామి, అధ్యాపకులు మనోజ్, ఇతర అధ్యాపక బృందం పాల్గొన్నారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న వివిధ రకాల స్టార్‌లు



క్రిస్మస్ ట్రీలు, తోరణాలు, ఇతర అలంకార వస్తువులు

నగరంలో ఆరంభమైన క్రిస్మస్ సందడి..

స్టార్‌లు, లైటింగ్ సెట్టింగ్‌లు కొనగోళ్లతో కళకళలాడుతున్న దుకాణాలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఏసుక్రీస్తు పుట్టినరోజు సందర్భంగా జరుపుకునే క్రిస్మస్ పండుగ సందడి మార్కెట్‌లో మొదలైంది. డిసెంబర్ 25వ తేదీన జరిగే ఈ వేడుకల కోసం నెల రోజుల ముందు నుంచే క్రైస్తవ విశ్వాసులు అన్ని ఏర్పాట్లను చేసుకుంటారు. దీంతో నగరంలో ఏ ప్రధాన కూడలి చూసినా.. ఏ దుకాణానికి వెళ్లిన శాంతాక్లాజ్ బొమ్మలు, స్టార్‌లు దర్శనమిస్తున్నాయి. డిసెంబర్ నెల అంటేనే క్రిస్మస్ పండుగ సంబరాల మాసంగా మార్కెట్‌లో వాతావరణం మారిపోతుంది. ఇప్పటికే సెమీ క్రిస్మస్‌లు, క్యారెల్స్‌లతో చర్చిలు, ప్రార్థనా మందిరాల నిర్వాహకులు ఆయా వీధుల్లో సందడి మొదలుపెట్టేశారు. ప్రధానంగా ఏసుక్రీస్తు ప్రభువు పుట్టిన ప్రదేశాన్ని జ్ఞానులకు చూపించిన నక్షత్రానికి గుర్తుగా ప్రతి క్రైస్తవ విశ్వాసులు, క్రైస్తవ మతపెద్దలు వారి నివాసాల ముందు, చర్చిలు,



వివిధ రకాల లైటింగ్ స్టార్‌లు

రోడ్ల వద్ద డిసెంబర్ 1వ తేదీ నుంచే పెద్ద పెద్ద స్టార్‌లను ఏర్పాటుచేస్తుండడంతో నగర వీధుల్లో క్రిస్మస్ కాంతులు విరాజిల్లుతున్నాయి.

మార్కెట్‌లో అందుబాటులో అనేక కొత్త వస్తువులు:

క్రిస్మస్ పండుగ బేరాల కోసం వ్యాపారులు అనేక ప్రత్యేక రకాల వస్తువులను అందుబాటులో ఉంచారు. విద్యుత్ లైటింగ్‌లతో కూడిన స్టార్‌లు,



బీఆర్‌టీఎస్ రోడ్డులో శాంతాక్లాజ్ మాస్కులు, డ్రెస్‌లు విక్రయిస్తున్న చిరువ్యాపారులు

క్రిస్మస్ ట్రీ, శాంతాక్లాజ్ బొమ్మలు, మాస్కులు, ఆకర్షణీయమైన కొవ్వొత్తులు, పశువుల పాక సెట్టింగ్‌లతో పాటు, ఇంటిని అలంకరించుకునేందుకు వినూత్నమైన తోరణాలు విక్రయిస్తున్నారు. దీంతో క్రిస్మస్ పండుగ రాకతో మార్కెట్‌లోని దుకాణాలన్నీ కళకళలాడుతూ కనిపిస్తున్నాయి.



క్రిస్మస్ సామాన్లు కొనుగోలు చేస్తున్న దృశ్యం

కూటమి ప్రభుత్వంపై పోరుబాట



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న మల్లాది విష్ణు, వైఎస్సార్ సీపీ నాయకులు

- వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- ఈ నెల 13న అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజలను అన్నివిధాలా మోసగిస్తున్న కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈ నెలలో పోరాటాలకు సిద్ధమైందని పార్టీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఈ నెల 13వ తేదీన వైఎస్సార్‌సీపీ తలపెట్టిన 'అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ' కార్యక్రమ గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమం సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఓ మాట, ఎన్నికల తర్వాత మరోమాట చెప్పడం చంద్రబాబుకి కొత్తేమీ కాదని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కన్నా ఎక్కువ సంక్షేమం అందిస్తామని ఎన్నికల ముందు ప్రచార సభలలో పదేపదే ఊదరగొట్టిన చంద్రబాబు.. తీరా అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలను మోసగించారని మండిపడ్డారు. రైతన్నలకు రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామంటూ వంచించారని నిప్పులు చెరిగారు. అన్నదాతల పట్ల ఈ ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా.. ఈ నెల 13న 'అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ' కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు చెప్పారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే కార్యక్రమ ప్రధాన అజెండా అని పేర్కొన్నారు. ఇందులో భాగంగా అన్నదాతలతో కలిసి జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు అందిస్తామన్నారు. వ్యవసాయం దండగ అని చంద్రబాబు అంటే.. వైఎస్ జగన్ దానిని పండుగ చేసి చూపారని తెలిపారు. విత్తనాలు నాటిన నాటి నుంచి ధాన్యం కొనుగోలు వరకు అనేక జాగ్రత్తలు తీసుకుని అన్నదాతలకు మేలు చేసిన విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. వైఎస్సార్ రైతు భరోసా, ఉచిత పంటల బీమా పథకం, రాయితీ విత్తనాలు, పురుగు మందులు, యాంత్రీకీకరణ పరికరాలు వంటి సంక్షేమ కార్యక్రమాలతో అన్నదాతలను తాము అన్ని విధాలా ఆదుకున్నామన్నారు. రైతుల పట్ల కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈ నెల 13వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రతిఒక్కరూ బీసెంట్ రోడ్డులోని పాత కార్యాలయానికి చేరుకోవాలని.. అక్కడి నుంచి ప్రదర్శనగా మ్యూజియం రోడ్డు మీదుగా జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లడం జరుగుతుందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలంతా ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ కొండాయిగుంట మల్లేశ్వరి, నాయకులు అలంపూర్ విజయ్, దోనేపూడి శ్రీనివాస్, మేడా రమేష్, పి.నారాయణ, ప్రబల శ్రీనివాస్, పత్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పండ్లు, పౌష్టికాహారం పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెడిక ఆధ్వర్యంలో బుధవారం నిరుపేద, హెచ్ఐవీ బాధితులకు పండ్లు, న్యూట్రిషన్ ఫౌడర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఆర్టీ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వీర్నాల గౌతం అంబేడ్కర్, డాక్టర్ శ్రీదేవి హెచ్ఐవీ సోకిన వారు పౌష్టికాహారం తీసుకోవాల్సిన అవసరం గురించి వివరించారు. హెచ్ఐవీ బాధితులకు న్యూట్రిషన్ ఫౌడర్, పండ్లు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెడిక సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. క్లబ్ అధ్యక్షులు పైడిమర్రి వేణుగోపాల్ మాట్లాడుతూ తమ వంతు సామాజిక బాధ్యతగా తాము నిరుపేదలు, హెచ్ఐవీ సోకిన వారికి న్యూట్రిషన్ ఫౌడర్, పండ్లు అందజేస్తున్నట్లు తెలిపారు. హెచ్ఐవి సోకిన వారికి న్యూట్రిషన్ అవసరం ఎంతైనా ఉందన్నారు. కావున తమ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్, సిపిఆర్ ప్రోగ్రామ్స్ లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ దేవతి నాగేశ్వరరావు మాట్లాడుతూ రూ. 295 విలువగల ప్రోటీన్ పౌడర్



పండ్లు, న్యూట్రిషన్ ఫౌడర్ అందజేస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెడిక ప్రతినిధులు

డబ్బాలను బెంగళూరు హై -కార్ప్ సంస్థ స్పాన్సర్ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈనెల 14వ తేదీన మరో వంద మందికి న్యూట్రిషన్ ఫౌడర్, విద్యార్థులకు నోట్‌బుక్స్, పండ్లు, మిఠాయిలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పువ్వాడ లక్ష్మి శ్రీనివాస్, కోశాధికారి గుర్రం లక్ష్మినారాయణ, జీవీ సుబ్రహ్మణ్యం, కౌన్సిలర్లు, కె.వరప్రసాద్, లక్ష్మణరావు, వైఆర్‌జీకేర్ సంస్థ సిబ్బంది నాగూర్‌బీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అవసరమైన వసతులు కల్పించండి



పటమట(విజయవాడతూర్పు): ప్రజలకు అవసరమైన వసతులన్నీ కల్పించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. 52వ డివిజన్లోని మల్లికార్జునపేట, ఉపరవాగు సెంటర్, పరిసర ప్రాంతాలను బుధవారం ఆయన పరిశీలించారు. సైడ్ కాలువలు, కమ్యూనిటీ టాయిలెట్లు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తాగునీటి సరఫరాలో ఎలాంటి లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పైపులు లీకేజ్ గుర్తిసే వెంటనే మరమ్మతులు చేయాలని, పైపులైన్ ద్వారా గృహాలకు వెళ్లే తాగునీటి సరఫరాలో నీరు కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆ ప్రాంతంలో ఉన్న మెట్లను మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. సైడ్ డ్రైనేజీల్లో ఉన్న వ్యర్థాలు ఎప్పటికప్పుడు తొలగించాలని పేర్కొన్నారు. ఇంటింటి చెత్త సేకరణ జరగాలని, స్థానికులు తమ ఇళ్లలోని వ్యర్థాలను సైడు డ్రైయిన్లలో వేయకుండా సచివాలయ సిబ్బందితో అవగాహన కల్పించాలని తెలిపారు. ఉప్పరవాగులోని మగవారిక్వారీ సమీపంలో ప్రజలకు అవసరమైన సంపు, వాహనాలు నిలుపుదకు పార్కింగ్ సౌకర్యం కల్పించాలని చెప్పారు. అవసరమైన చోట కాల్వలపై ఐరన్‌మెష్‌లు ఏర్పాటు చేయాలని, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు చేపట్టాలని తెలిపారు. ఈ పర్యటనలో 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండెంట్ ఇంజినీర్ వర్క్స్ పి. సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వర రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ శివరాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా అక్కినేని విగ్రహావిష్కరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ అక్కినేని నాగేశ్వర రావు శత జయంతి పురస్కరించుకుని తుమ్మలపల్లి వారి కళాక్షేత్రం ప్రాంగణంలో డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ, ఎక్స్‌రే సంస్థ ఆధ్వర్యాన ఈనెలాఖరులోగా డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వర రావు తెలిపారు. దుర్గాపురానికి చెందిన డాక్టర్ బ్రహ్మదేశం సోషల్‌సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, పద్మ విభూషణ్ నటసామ్రాట్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు విగ్రహావిష్కరణ ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని చెప్పారు. ఇప్పటికే డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు విగ్రహం తీసుకురావటం జరిగిందన్నారు. సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ మాట్లాడుతూ అక్కినేని విగ్రహావిష్కరణకు సహకరిస్తున్న ఎక్స్‌రే సంస్థ అధ్యక్షులు కొల్లూరికి కృతజ్ఞతలు తెలిపారు.



అక్కినేని విగ్రహం వద్ద కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ తదితరులు

తాము ఇప్పటికే పలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఇప్పుడు అక్కినేని విగ్రహం ఏర్పాటు చేస్తున్నామన్నారు. తెలుగు చిత్రపరిశ్రమంలో తనదైన ముద్రను వేసిన అక్కినేని విగ్రహావిష్కరణ కార్యక్రమంకు అక్కినేని అభిమానులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి కొండాయగుంట రాము, బందారు వేంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ కమిటీని రద్దు చేయాలి

నవరంగ్
కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు షేక్ జలీల్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):టీడీపీ కూటమి ప్రభుత్వం నియమించిన వక్ఫ్ కమిటీని తక్షణమే రద్దు చేయాలని నవరంగ్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు షేక్ జలీల్ డిమాండ్ చేశారు. బుధవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నియమించిన కమిటీని రద్దు చేసి ఎన్నికలు నిర్వహించాలన్నారు. వక్ఫ్ కమిటీ ఎన్నికలు నిర్వహించకుండా అధ్యక్షుడిని ప్రకటించడం సరైన పద్ధతి కాదన్నారు. అన్యాక్రాంతమైన వక్ఫ్ బోర్డు భూములపై సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరారు. భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని మైనార్టీల్లోని పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డులో పనిచేస్తున్న అధికారులను ప్రక్షాళన



సమావేశంలో మాట్లాడుతున్న షేక్ జలీల్

చేయాలన్నారు. ఎన్నికల ముందు ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో షాదీఖానాలకు స్థలాలు కేటాయించి ప్రభుత్వమే నిర్మాణం చేయాలని తెలిపారు. దుల్హన్ పథకాన్ని అమలు చేసి రూ. లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జాకీర్ హుస్సేన్, సయ్యద్ సైదా, గుర్రం రామారావు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఒంగోలుకు చెందిన లిటిల్ చాంప్స్ ఎడ్యుకేషన్ సొసైటీ కళానిలయానికి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. బుధవారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై 17 మంది కళాకారులు కూచిపూడి నృత్యంలో పలు అంశాలను ప్రదర్శించారు. అందులో నరసింహస్వామి వారి అవతారంపై ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులందరినీ అలరించింది. సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించిన చిన్నారులను ఆలయ ఈవో కె.ఎస్.రామరావు అభినందించి ప్రశంసా ప్రతాలను అందజేశారు. చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆధునికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రతి ఒక్కరికీ అందించేందుకు ది విజయవాడ ప్రైవేట్ ఎలక్ట్రికల్ అసోసియేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు అన్నారు. మాచవరం ది విజయవాడ ప్రైవేట్ ఎలక్ట్రికల్ అసోసియేషన్ కార్యాలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన స్మార్ట్ ఇంజినీరింగ్ సొల్యూషన్స్ ప్రారంభోత్సవం బుధవారం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి, అసోసియేషన్ అధ్యక్షుడు కె. శ్రీహరి, డీపీ సత్యనారాయణ, వై.శంకరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నిరకాల సేవలను ఆధునిక టెక్నాలజీను వినియోగదారులకు చేరువ చేయటం అభినందనీయం అని చెప్పారు. ముఖ్యంగా సోలార్ ఎనర్జీ



స్మార్ట్ ఇంజినీరింగ్ సొల్యూషన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు

హోమ్ ఆటోమేషన్, ఫైర్ సెక్యూరిటీ అలారమ్స్ సేవలు వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందిస్తాయని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు వల్లభనేని సతీష్, బుజ్జి, తోట పాండు , సీహెచ్ శ్రీనివాస్, నాగశివసాయి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు కృషి

ఏసీపీ లతకుమారి

మధురానగర్(విజయవాడసెంట్రల్): దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు తెలిపారు. అయోధ్యనగర్ చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ ఆధ్వర్యాన మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకుని డాక్టర్ టి.కృష్ణకుమారి అధ్యక్షతన దివ్యాంగుల హక్కులు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల హక్కుల చట్టం ఆర్‌పీడబ్ల్యూడీ యాక్టు 2016 గురించి వక్తలు వివరించారు. దివ్యాంగులు తమ హక్కులు గురించి పూర్తి అవగాహన కలిగి ఉండటంతో పాటు వాటిని వినియోగించుకోవాలని సూచించారు. అన్ని రంగాల్లోనూ దివ్యాంగులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ప్రభుత్వం కల్పించిన చట్టాలు అవకాశాలను వినియోగించుకోవాలని ఇందుకుగానూ చేయూత వంటి సంస్థలను సంప్రదించాలని సూచించారు. అవగాహన సదస్సులో దివ్యాంగులు, వయోవృద్ధుల



మాట్లాడుతున్న ఏసీపీ కె.లతకుమారి

శాఖ సహాయ సంచాలకులు కామరాజు, మండల న్యాయ సేవాసంస్థ సెక్రటరీ త్రినాథ్, మహిళ పోలీస్‌స్టేషన్ ఏసీపీ లతకుమారి, రిటైర్డ్ ఆర్జేడీ సూయజ్, రిటైర్డ్ ఏడీ ఏవీడీ నారాయణరావు, ఎస్‌బీఐ బ్రాంచి డెప్యూటీ మేనేజర్ దుర్గాప్రసాద్ పాల్గొని దివ్యాంగులు హక్కులు, అమలు, ఎదుర్కొంటున్న సమస్యలు గురించి మాట్లాడారు. అలాగే నేషనల్ ట్రస్ట్ దివ్యాంగులకోసం ఏర్పాటు చేసిన నిరామయ ఆరోగ్య బీమా పథకం గురించి వివరించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల తల్లిదండ్రులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): చదువుతో మాత్రమే మన ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పడుతుందని... ప్రతి ఒక్కరూ బాగా చదువుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కృపా మినిస్ట్రీస్ అధినేత డాక్టర్ రవీంద్ర అన్నారు. ఆ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పాయకాపురం ఎల్‌బీఎస్ నగర్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు అనే ఆయుధం మన స్థాయిని.. జీవితాన్ని మార్చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ క్రమ శిక్షణ, పట్టుదలతో చదివితే తప్పకుండా విజయం సాధించవచ్చని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు కూడా పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలనే ఆకాంక్షతో ఇలా ప్రతి ఏడాది అన్ని సబ్జెక్టులకు సంబంధించిన ప్రధాన ప్రశ్నలు-జవాబులతో



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న రవీంద్ర, హెచ్‌ఎం హుస్సేన్ తదతరులు

కూడిన ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలను ఉచితంగా అందిస్తున్నామన్నారు. స్కూల్‌లోని 145 మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు అలంపూరు విజయ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మైనం హుస్సేన్, ఉపాధ్యాయులు సునంద, రాధిక, సత్యవతి, శ్రీనివాసరావు, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సైకిళ్లు పంపిణీ



పాయకాపురం (విజయవాడరూరల్): పాయకాపురం ఎల్‌బీఎస్ నగర్ ప్రభుత్వ విభిన్న ప్రతిభావంతుల బాలుర వసతి గృహంలో మూగ, చెవిటి విద్యార్థులకు అన్నసంతర్పణ సమితి ట్రస్ట్ ఆధ్వర్యాన సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షులు గుండు దిలీప్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు చెందిన మూగ, చెవిటి విద్యార్థులు కాలేజీకి వెళ్లడానికి ఇబ్బందిగా ఉందని హాస్టల్ వార్డెన్ నాగస్వర్ణ తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీంతో తాము ట్రస్ట్ సభ్యుల సహకారంతో ఐదుగురికి సైకిళ్లు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తమ సేవలు సద్వినియోగం చేసుకుని చక్కగా చదివి నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. ట్రస్ట్ శాశ్వత సభ్యులు జూలూరు శోభనాచలపతి గుప్తా, చిట్టూరి నంద గోపాల్ మాట్లాడుతూ అవసరమైనప్పుడు మరిన్ని సైకిళ్లు అందించటానికి తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు. తాము అడిగిన వెంటనే ఐదు సైకిళ్లు అందజేసిన ట్రస్ట్ సభ్యులకు హాస్టల్ వార్డెన్ నాగస్వర్ణ కృతజ్ఞతలు తెలిపారు.

సామూహిక హారతులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురం అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి దేవాలయంలో బుధవారం సాయంత్రం గీతా జయంతి, జనవరి 5న జరగబోయే హైందవ శంఖారావం కార్యక్రమంలో భాగంగా సామూహిక హారతులు నిర్వహించారు. ఈ సందర్భంగా గీతాజయంతి విశిష్టతను భక్తులకు వివరించారు. అలాగే జనవరి 5న జరగబోయే హైందవ శంఖారావంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.